క్లుప్తంగా

26న ఆరోగ్య సదస్సు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 26న కొత్తగూడెం క్లబ్‌లో జరిగే ఆరోగ్య సదస్సుకు (డాక్టర్ మీట్‌కు) హాజరు కావాలని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్‌కు మొక్క అందించి సింగరేణి ప్రకృతి ఆశ్రమం నిర్వాహకులు ఆహ్వానం పలికారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కలుసుకున్నారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణ ప్రజలు, సింగరేణి ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మీరు వచ్చి మీ అమూల్యమైన సందేశాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మొక్కల వెంకటయ్య, డాక్టర్ కృష్ణయ్య, సుగుణరావు, శంకర్, రాజేష్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

ఇల్లెందు: సంక్షేమ పాలనకు కేరాఫ్ కాంగ్రెస్ అని పలు సందర్భాల్లో రుజువయిందని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ జి.రవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 4,5,6,7 వార్డుల్లో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్‌ను చదివి వినిపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అమలు చేయనున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జీవీ భద్రం, వాసుదేవ్, లింగంపల్లి శ్రీనివాస్, నాగరాజు, ఆనంద్, వెంకటనారాయణ, లక్ష్మణ్‌రావు, వర్మ, ఈశ్వర్ గౌడ్, తిరుమల, బాణాల శ్రీనివాస్, జ్యోతి, చెంచమ్మ, వెంకటలక్ష్మి, రమేష్, సోనూ, అరవింద స్వామి, రవి, పాషా పాల్గొన్నారు.

సంస్కరణలపై అవగాహన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఇల్లందు క్రాస్ రోడ్డు సమీపంలోని సింగరేణి కాలేరీస్ గెస్ట్ హౌస్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆర్‌డీఏటీ ఎన్ఎస్‌టీఐ హైదరాబాద్ వారు, సంయుక్త ఖమ్మం జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్యంలతో అప్రెంటిషిప్ సంస్కరణల మీద శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్ మాట్లాడుతూ.. అప్రెంటిషిప్‌పై అవగాహన, సూచనలు చేశారు. కార్యక్రమంలో సింగరేణి జీఎం(హెచ్‌ఆర్) రామ్‌మోహన్, ఇంటర్ నోడల్ అధికారి సులోచనరాణి, ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్, సింగరేణి, కెటీపీఎస్, ఐటీసీ బీపీఎల్, నవభారత్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యల వారు పాల్గొన్నారు.

పార్క్ నిర్మాణ పనుల పరిశీలన

ఇల్లెందు: పట్టణంలో ఏడాదిగా నిర్మాణ పనులు జరుగుతున్న లేక్ వ్యూ పార్క్ పనులను శుక్రవారం మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సందర్శించారు. వేసవి కాలానికి ముందే పార్క్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించండి

పాల్వంచ: పాల్వంచ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ యువతరం పార్టీ, క్లీన్ అండ్ గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మున్సిపల్ మంత్రి కేటీఆర్ స్పందించి తక్షణమే పాల్వంచ పట్టణ వార్డులు విభజన చేసి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొట్రు ప్రవీణ్, భట్టు కృష్ణ, బాడిశ భిక్షం దొర, వంగ పవన్, సురేశ్ నాయక్, నరేశ్, దాసరి శివ రామ కృష్ణ, ఆళ్లగడ్డ కృష్ణబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా సీసీ రహదారి నిర్మాణ పనులకు సర్పంచ్ వల్లాల మంగమ్మ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో అందుబాటులో ఉన్న నిధులు, వివిధ గ్రాంట్ల ద్వారా మంజూరైన నిధులతో అత్యధిక విస్తీర్ణంలో సీసీ రోడ్లు వేయించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాలవెల్లి నర్సింహారావు, ఎంపీటీసీ శీలం ఉమ, వార్డు సభ్యుడు ఆళ్ల నాగేశ్వరరావు, కొలిపాక కవిత, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

పాల్వంచ: పట్టణంలోని తెలంగాణ నగర్ కాలనీకి విద్యుత్ సౌకర్యం కోసం అయ్యే ఖర్చును మున్సిపాలిటీ నుంచే మంజూరు చేయాలని కోరుతూ స్థానికులు శుక్రవారం మున్సిపల్ మేనేజర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. స్థానికులు మాట్లాడుతూ.. పన్నెండు ఏళ్లుగా 270 కుటుంబాలు ప్రభుత్వ స్థలంలో పక్కా గృహాలు నిర్మించుకుని ఉంటున్నామని, విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వేయాల్సి ఉందని, దీనికి రూ.25లక్షలు విద్యుత్ సంస్థకు చెల్లించాల్సి ఉందని, నిరుపేదలమైన తాము అంత మొత్తం చెల్లించలేమని, ఆ సొమ్మును మున్సిపాలిటీ నుంచి భరించి తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, దేవేందర్, సురేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్ల సేవలు అపరిమితం

- పంచాయతీ నిర్వహణలో సగం భారం వీరిపైనే..
- అయినా ఉద్యోగ భద్రతకు నోచుకోని దయనీయ స్థితి



మాణిక్యారం గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థలు అత్యంత కీలకం. ఇందులోనూ గ్రామపంచాయతీల పాలన అత్యంత ప్రధానం. పంచాయతీ పాలనలో సర్పంచ్‌లు, కార్యదర్శులు రెండుకళ్లు. వీరికి చేదోడు వాదోడుగా నిలుస్తూ పంచాయతీ పాలనలో తమకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు కారోబార్లు. నేటికీ గ్రామాలలో జరిగే అన్ని రకాల పనులలో, రికార్డుల నిర్వహణలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సహాయ సహకారాలు అందిస్తుంటారు. కానీ కారోబారు వ్యవస్థ నాటి నుంచి ప్రస్తుత మల్టీ పర్పస్ వర్కర్ వ్యవస్థ వరకు అవమానాలు ఎదుర్కొంటూ.. ఉద్యోగ భద్రత కరవై ఎదుగుబొదుగూ లేని జీవితంతో దినదిన గండంగా కాలం వెళ్లదీస్తున్నారు.

ముప్పై ఏళ్లుగా అదే స్థానంలో...

పల్లె సీమలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా నిలుస్తున్న పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడ్డ నాటి నుంచే కారోబారు వ్యవస్థ ప్రారంభమైంది. అనేక రకాల మార్పులు, చేర్పులు జరిగినా ఈ వ్యవస్థలో కారోబార్ల స్థానం మాత్రం అలాగే ఉండిపోయింది. పంచాయతీరాజ్ నూతన చట్టంప్రకారం వీరి స్థాయిని తగ్గించి మల్టీపర్పస్ వర్కర్లుగా మళ్లీ నియమించారు. కానీ విధులు మాత్రం అలాగే చేయిస్తున్నారు. వీరంతా పల్లెల్లో ప్రజలకు, పాలకవర్గానికి, అధికారులకు, ప్రభుత్వానికి వారధులుగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ పల్లెల సమగ్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయినా కొన్ని సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల ఇబ్బంది పెట్టినా తప్పనిసరి పరిస్థితిలో సర్దుకుపోతున్నారు. గతంలో సీనియారిటీ ఉన్న కారోబార్లకు పంచాయతీ కార్యదర్శులుగా అవకాశం కల్పిస్తామని ఇచ్చిన హామీ నేటికీ ఆచరణకు నోచుకోలేదు. ఫలితంగా మల్టీపర్పస్ వర్కర్లుగానే మిగిలిపోతున్నారు.

గ్రామంలో సగం భారం వీరిపైనే..

గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే కారోబార్లు (మల్టీపర్పస్ వర్కర్లు) అపరిమితమైన సేవలు అందించడంతోపాటు పాలనాపరమైన విధులలో సగం భారం మోస్తున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం, అర్హులైన గ్రామస్తులకు సంక్షేమ ఫలాలు అందించడం, గ్రామాలలో పన్నులు వసూలు చేయడం, వీధులలో తలెత్తే సమస్యలు గుర్తించి పరిష్కరించడం లేదా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, రహదార్లు, కాలువలు శుభ్రం చేయించడం, మొక్కలు నాటించడం, వాటిని సంరక్షించడం, నర్సరీల నిర్వహణ, గ్రామ సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచడం.. ఇలా లెక్కకు మించి పనులు తమ భుజాలపై వేసుకొని విధులు నిర్వహించడం కారోబార్లకు నిత్యకృత్యం. ఈ పనుల నిర్వహణలో ఇతర సిబ్బంది సహకరిస్తున్నప్పటికీ ఇందులో ఏ ఒక్క తప్పిదం జరిగినా.. నిధుల విషయంలోఅవకతవకలు జరిగినా.. పూర్తి బాధ్యత కారోబార్లే వహించాల్సి ఉంటుంది.



ఇంటి పన్ను వసూలు చేస్తున్న కారోబార్

ఇలా చేస్తే కొంతైనా మేలు..

కారోబార్లుగా కొనసాగుతున్న వారిని మల్టీపర్పస్ వర్కర్లుగా కాకుండా కారోబార్ పేరుతో విధుల్లో కొనసాగించాలి. వీరికి కనీస వేతన చట్టం అమలు చేయాలి. పంచాయతీలో చేపట్టే కొత్త నియామకాల్లో వీరికి ప్రాధాన్యమివ్వాలి. పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆరోగ్య కార్డులను అందించడం.. విధి నిర్వహణలో మృతి చెందిన వారిని ఆర్థికంగా ఆదుకోవడం, వారి కుటుంబసభ్యులకు అవకాశం కల్పించడం వంటి సదుపాయాలు కల్పిస్తే కొంతైనా మేలు చేసినట్లు అవుతుంది.

మా శ్రమను గుర్తించడం లేదు



పంచాయతీలలో జరిగే అన్ని పనులలో పాలు పంచుకోవడంతోపాటు ప్రజలకు ఎల్లవేళలా సేవలందించే తమ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదు. పాతికేళ్లకు పైగా కారోబారుగా విధుల్లో ఉన్నా తమను మల్టీపర్పస్ వర్కర్లుగానే బాధ్యతలు అప్పగించడం బాధాకరం.

– మోహన్‌రావు, మల్టీపర్పస్ వర్కర్, రేపల్లెవాడ

కార్యదర్శులుగా అవకాశమివ్వాలి



సీనియారిటీ ఉన్న కారోబార్లకు పంచాయతీ కార్యదర్శులుగా అవకాశం కల్పిస్తామని గతంలో ప్రకటించారు. హామీ కూడా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రతిపాదనలు స్వీకరించారు. కానీ ఆ తరువాత గాలికొదిలేశారు. గతంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేసి మాకు న్యాయం చేయాలి.

– జటంగి వెంకన్న, మల్టీపర్పస్ వర్కర్, పోలారం

మెరుగైన సేవలు అందిస్తున్నాం



గ్రామపంచాయతీలలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా విధులు నిర్వహిస్తున్నాం. అన్ని రకాల విధులలో మా భాగాస్వామ్యం ఎక్కువగా ఉంటోంది. దీర్ఘకాలం విధుల్లో కొనసాగిన మమ్ములను నేటికీ మల్టీపర్పస్ హోదాలోనే పనులు చేయించడం దురదృష్టకరం.

– తాండ్ర కిరణ్, మల్టీపర్పస్ వర్కర్, విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీ

పోలారంలో వారపు సంత ప్రారంభం

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామ పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ వాంకుడోత్ సరోజిని వారపు సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటుతున్నాయని, రైతులు వారు పండించిన పంటలను స్వయంగా విక్రయించుకునేలా సంతను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తద్వారా గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరడంతోపాటు ప్రజలకు తక్కువ ధరలో నిత్యావసరాలు లభించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి ఆదివారం సంతను నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపసర్పంచ్ శ్రీరాంకోటయ్య, గ్రామ పెద్దలు మోడెం వెంకన్న, ఉమామహేశ్వరరావు, మహేష్, బాలు, పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి, గుమస్తా జటంగి వెంకన్న పాల్గొన్నారు.



సంతను ప్రారంభిస్తున్న సర్పంచ్ సరోజిని

మీ కోసం.. నేడు 'సాక్షి' ఫోన్ ఇన్

ఇల్లెందు: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల పరిష్కారం కోసం 'సాక్షి'తోడుగా ఉంటుంది. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, కుక్కలు, కోతుల బెడదను నివారించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తుంది. ఈ మేరకు శనివారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ అంకుషావలీ పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకోవటంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తారు. ప్రజలు 9059359694 నంబరుకు ఫోన్ చేసి ఉదయం 11 – 12 గంటల మధ్య సమస్యలు తెలియజేయవచ్చు.

అపోహలొద్దు.. మెరుగైన వైద్యం అందిస్తాం



క్షయపై అవగాహన కల్పిస్తున్న శంకర్, సర్వస్

టేకులపల్లి: క్షయ (టీబీ) వ్యాధి పట్ల భయం, అపోహలు వద్దని మందులతో నయం అవుతుందని, టీబీ నివారణకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని ఇల్లెందు యూనిట్ క్షయ వ్యాధి సూపర్‌వైజర్లు శంకర్, సర్వస్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో టీబీపై ఉపాధ్యాయులు, బాలికలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల నిరంతర పర్యవేక్షణలో వ్యాధి పూర్తిగా తగ్గేంత వరకు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు మందులు వాడే కాలానికి పోషకాహార నిమిత్తం నెలకు రూ.500 కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం లాంటి లక్షణాలు గమనించినట్లయితే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఇది గాలి ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి సంక్రమించే అంటు వ్యాధి అన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఆ వ్యక్తి కుటుంబ సభ్యులతో పాటు సమాజంలోని ఆరోగ్యవంతులకు కూడా వ్యాధి సోకుతుంది కాబట్టి, దీనిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండి ఇలాంటి లక్షణాలు ఉన్న వ్యక్తిని గుర్తించినట్లయితే వెంటనే వ్యాధి నిర్ధారణ కోసం సమీపంలోని పీహెచ్‌సీకి పంపించి క్షయ అంతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సంతు, వైద్య సిబ్బంది పరంగిణి, జ్యోతి, సీతమ్మ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు 'సంక్షేమం' అందించాలి

ఇల్లెందురూరల్: గ్రామీణ వైద్యులకు షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని గ్రామీణ వైద్యుల సహాయక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని రొంపేడు గ్రామంలో శుక్రవారం ఏర్పాటైన సంఘం మండల శాఖ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పరిమితికి లోబడి మాత్రమే గ్రామీణ వైద్యులు వైద్య సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి కాంతారావు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

టేకులపల్లి: టేకులపల్లి మండలం మొక్కంపాడు పంచాయతీ మొక్కంపాడు తండాలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి ఎంపీపీ భూక్యా రాధ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ పంచాయతీలో మొక్కంపాడుతండాకు 12, మొక్కంపాడు గ్రామానికి 8 చొప్పున మొత్తం 20 ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణోతు విజయ, ఉప సర్పంచ్ రాందాస్, గ్రామ పెద్దలు భూక్యా సైదులు నాయక్, బాణోతు వాలు నాయక్, అజ్మీర రవి, సులానగర్ ఉప సర్పంచ్ ఉండేటి బసవయ్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జూలూరుపాడు: మండలంలోని కరివారిగూడెం, కొమ్ముగూడెం గ్రామాల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పర్యటించారు. కరివారిగూడెం కాలనీలో జరిగిన శ్రీ మోక్ష కోదండరామ ఆంజనేయస్వామి, గ్రామ దేవతా విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామ దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కరివారిగూడెం గ్రామానికి చెందిన తాటికొండ కృష్ణారావును మాజీ ఎంపీ పరామర్శించారు. కొమ్ముగూడెంకు చెందిన మాజీ ఎంపీపీ బానోత్ లాలు నాయక్ నివాసానికి మాజీ ఎంపీ వెళ్లి అతని తల్లిదండ్రుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, ధరావత్ రాంబాబు, లేళ్ల గోపాల్‌రెడ్డి, దుద్దుకూరి నరసింహారావు, బానోత్ లాలు నాయక్ పాల్గొన్నారు.

గళమెత్తిన ప్రజాప్రతినిధులు

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ లావుడ్యా సోనీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కాకపోవడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. మిషన్ భగీరథ నీటి సరఫరా పలు గ్రామాల్లో సక్రమంగా జరగడం లేదని, రానున్న వేసవి కాలంలో తాగునీటి సమస్య మరింత తీవ్రతరం అవుతుందని ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, ఎంపీటీసీలు బానోత్ నీల, కాజా విజయరాణి, వెంగన్నపాలెం సర్పంచ్ గలిగె సావిత్రి మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలను డిమాండ్ చేశారు. బెల్టు దుకాణాలపై నియంత్రణ లేకపోవడంతో విచ్చలవిడిగి పెరిగిపోతున్నాయని, దీంతోపాటు మద్యంను ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని ప్రజాప్రతినిధులు ఎక్సైజ్ ఎస్ఐ సాయికుమార్‌కు ఫిర్యాదు చేశారు. వైస్ ఎంపీపీ గాదె నిర్మల, ఎంపీడీఓ కేఎస్ వెంకటేశ్వరరావు, ఎంఈఓ గుగులోత్ వెంకట్, పశువైద్యాధికారి బానోత్ బద్దులాల్, విద్యుత్‌శాఖ సతీష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణవేణి, ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలజ్యోతి, ఏపీఎం సత్యనారాయణరాజు, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఈజీఎస్ ఏపీఓ రవి, డీఆర్‌ఓ లక్ష్మీ నర్సు, ఏఈఓ గోపీకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎక్సైజ్ ఎస్ఐను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

దేవాలయ అభివృద్ధికి కృషి చేయండి

సుజాతనగర్: దేవాలయ అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శివాలయంలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, సుగ్గల రాధిక, భూక్యా శోభన్, చేతుల పరమయ్య, ఉబ్బనపల్లి ప్రసాద్, గద్దం వీరరాజశేఖర్, వేములపల్లి వెంకటరావులచే ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బేల్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుకు తాను కృషి చేస్తానని తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన...

మండల కేంద్రంలో 1.4 కిలోమీటర్ల మేర సీడీపీ నిధులు రూ.38 లక్షలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేందర్ రావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, పీఆర్ ఏఈ శివలాల్, ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఆత్మకమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండె వీర హనుమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, బోడా హరినాయక్, ఎంపీటీసీలు మానస, శోభారాణి, సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: టేకులపల్లి మండలం రాంపురం పంచాయతీ పాతతండా(రాంనగర్)లో గ్రామ పెద్దలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, పలువురు దాతల సహకారంతో రూ.కోటి రూపాయలతో శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక సేవలో ఉన్న ఆనందం చెప్పలేనిదని, ఆలయానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందజేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా ఇందిర, ఎంపీటీసీ బాణోతు సరోజిని, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు...

టేకులపల్లి: మండలంలోని రోళ్లపాడు పంచాయతీ రుక్మాతండాలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ శుక్రవారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. రోళ్లపాడు పంచాయతీకి రూ.40 కోట్లతో 8 రోడ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన నాణ్యతగా పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. కంటివైద్య పరీక్షల తీరును పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే సైతం కంటి పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ ధరావత్ లలిత, ఎం.సురేందర్, మండల అధ్యక్షుడు బి.వర ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాగయ్యకు కూనంనేని ప్రశంసలు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల హర్యానా రాష్ట్రంలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పరుగు పందెంలో రెండు స్వర్ణ, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్స్ సాధించి కొత్తగూడెం కీర్తిని జాతీయ స్థాయిలో చాటిన సీహెచ్‌కే నాగయ్యను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అభినందించారు. శుక్రవారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో జరిగిన ఒక కార్యక్రమంలో నాగయ్యను శాలువా, పూలమాలలతో సత్కరించారు. జాతీయ స్థాయి పోటీలో పతకాలు సాధించటమే కాకుండా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి, ఖమ్మం జిల్లా నుంచి ఒకే ఒక్కడు జాతీయ స్థాయిలో సత్తా చూపి రాణించటంతోపాటు అంతర్జాతీయ పోటీలకు ఎంపికావటం జిల్లాకు గర్వకారణమన్నారు. నేటి యువత నాగయ్యను ఆదర్శంగా తీసుకొని రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, వాసిరెడ్డి మురళీ, బాగం మహేశ్వర్‌రావు, బాగం మాధవరావు, జగన్, యాలాద్రి ప్రసాద్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నాగయ్యను సన్మానిస్తున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుందాం

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని ప్రతిఘటించాలని, ప్రైవేటీకరణ ప్రక్రియను అడ్డుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేసేందుకు ఉద్యమించాలని తెలిపారు. హిందుత్వ మనోన్మాద బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై అణచివేత దాడులు చేస్తూ దేశ ప్రజలకు ద్రోహం చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందని, సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించాలని వేలం వేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాలన్నింటికీ ఆమోదం తెలిపిన బీఆర్ఎస్ పార్టీ కేంద్రంతో పోరాటం అని నాటకమాడుతోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను ఎండగడుతూ సింగరేణిని రక్షించుకునేందుకు సమరశీల పోరాటాలకు సమరశంఖం పూరించి కార్మిక సంఘటిత శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సింగరేణి కార్మిక సమాఖ్య అండగా ఉంటుందని తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: కరివారిగూడెం కాలనీ శ్రీమోక్ష కోదండ రామాంజనేయ స్వామి ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో శుక్రవారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. శ్రీమోక్ష కోదండ రాముడు, శ్రీ ఆంజనేయస్వామి, గ్రామదేవతలు నాభిశిల, శ్రీముత్యాలమ్మతల్లి, శ్రీమారేడమ్మ, ధ్వజస్తంభాలను వేదపండితులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ హాజరై దేవతా విగ్రహాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూజా కార్యక్రమంలో జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావు, కరివారిగూడెం, కొమ్ముగూడెం, భోజ్యాతండా, భేతాళపాడు గ్రామ సర్పంచ్‌లు బోడా శాంతిరామ్, బానోత్ శాంతిలాల్, లావుడ్యా కిషన్‌లాల్, గుగులోత్ రాందాస్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పక్కా రోడ్డు కోసం ఎదురు చూపులు..

టేకులపల్లి మండల కేంద్రం టేకులపల్లి పంచాయతీ బేంసింగ్ తండా ఐఓ పెట్రోల్ బంక్ పక్కన పక్కా రోడ్డు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి నుంచి లోపలకు 12 అడుగుల వెడల్పు కచ్చా రహదారి ఉంది. వర్షం పడితే నరక యాతన. ఈ మార్గంలో పక్కా రోడ్డు నిర్మిస్తే అన్ని కాలాల్లోనూ నివాసాలతో పాటు పంట పొలాలకు వెళ్లేందుకు రైతులకు వెసులుబాటుగా ఉంటుంది. ఇప్పటికే జెడ్పీ నిధులు, ఎమ్మెల్యే నిధులతో టేకులపల్లి మండలంలో సీసీ రోడ్లు మంజూరై నిర్మాణం జరుగుతున్నాయి. పంచాయతీ నిధులతో కూడా రోడ్డు వేసుకునే అవకాశం ఉంది. ఈ రోడ్డు విషయమై ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం కూడా ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, ఏఈ, పీఆర్ టేకులపల్లి
సెల్ నంబర్ : 9676029621

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గంటల నుండి రాత్రి 8-00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ACM - 70132 21824 | ACO - 8074270476 | కొత్తగూడెం - 80083 21148 | భద్రాచలం - 99632 02011 | - 80742 70476 | ఇల్లెందు - 63052 41411 | - 79979 58226 | టోల్ ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

- 90102 23783 | - 97054 44183 | - 99516 02914 | - 97059 44416